ప్రజాశక్తి
శుక్రవారం 12 జనవరి 2024 5 అనంతపురం



మరొకరు ఖరారు..!

'మెట్టు'కు రాయదుర్గం వైసిపి పగ్గాలు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వైసిపి మూడో జాబితాను గురువారం రాత్రి విడుదల చేసింది. ఇందులో అనంతపురం జిల్లాకు సంబంధించి ఒక పేరు ఖరారైంది. రాయదుర్గం, మడకశిర, రెండు నియోజకవర్గాల సమన్వయకర్తల పేర్లు రానున్నట్లు ప్రచారం సాగినప్పటికీ రాయదుర్గం ఒక్క నియోజకవర్గానికే సమన్వయకర్తను నియమిస్తూ వైసిపి అధిష్టానం నిర్ణయం తీసుకుంది. ఎపిఐఐసి ఛైర్మన్‌గానున్న మెట్టుగోవిందరెడ్డిని రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించింది. ఇప్పటికే వైసిపి ఎమ్మెల్యేగానున్న కాపు రామచంద్రారెడ్డి వైసిపికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆ స్థానంలో ఇప్పుడు మెట్టుగోవిందరెడ్డిని నియమించారు. 2004లో రాజకీయ రంగ ప్రవేశం చేసిన మెట్టుగోవిందరెడ్డి మొదట తెలుగుదేశం పార్టీలో రాయదుర్గం ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తరువాత ఎమ్మెల్సీగానూ పనిచేశారు. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీని వీడి వైసిపిలో చేరారు. అప్పుడు అవకాశం రాకపోయినా ఆ పార్టీలోనే కొనసాగారు. ఎపిఐఐసి ఛైర్మన్‌గా ఆయన్ను వైసిపి ప్రభుత్వం నియమించింది.

'మెట్టు' ఎక్కడం సాధ్యమయ్యేనా ?

సౌమ్యుడిగా పేరున్న మెట్టుగోవిందరెడ్డి వైసిపి నేతలను ఏ మేరకు సమన్వయం చేసుకుని ముందుకెళుతారన్నది చూడాల్సి ఉంటుంది. ఆయన 2004లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తరువాత ఎమ్మెల్సీ పదవికాలం పూర్తియిన తర్వాత క్రియాశీలకంగా రాజకీయాలకు కొంత దూరంగా ఉన్నారు. రాయదుర్గంలో వైసిపి ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి అన్నీ తానై కాపు రామచంద్రారెడ్డి వ్యవహరిస్తూ వచ్చారు. నియోజకవర్గంలో మంచి పట్టుంది. ఇటు టిడిపిలో కాలవ శ్రీనివాసులు ఉంటూ వచ్చారు. ఇద్దరి మధ్యనే రాజకీయంగా వైరం నడుస్తూ వచ్చింది. దీంతో మెట్టుగోవిందరెడ్డికి క్షేత్ర స్థాయి నాయకులు, కార్యకర్తలతో సంబంధాలు తక్కువగానే ఉంటూ వచ్చాయి. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సమన్వయకర్త బాధ్యతలతోపాటు, వచ్చే సార్వత్రిక ఎన్నికల అభ్యర్థిగానూ ఉండనున్నారు. మెట్టు గోవిందరెడ్డి ఇప్పుడు ఇద్దరు అభ్యర్థులతోపోటీ పడాల్సి వస్తోంది. వైసిపి మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఎట్టి పరిస్థితుల్లోనూ రాయదుర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానని ప్రకటించారు. ఆయన పోటీ ఉంటే వైసిపిలో ఒక గ్రూపు ఆయన వైపు నడిచే అవకాశాలూ ఉండనున్నాయి. మరోవైపు ప్రభుత్వ వ్యతిరేకతను తట్టుకని టిడిపి అభ్యర్థి కాలవ శ్రీనివాసులను ఎదురొడ్డి ఎన్నికల్లో నిలబడాల్సి రానుంది. ఇన్ని ప్రతి కూలతలను ఎదుర్కొని ఎన్నికల బరిలో నిలిచే మెట్టుగోవిందరెడ్డి గట్టెక్కడం పెద్ద సవాల్‌గానే మారనుంది. అది బిసి సామాజిక తరగతి బలమున్న చోట ఈయన నెట్టుకు రావడం కష్టతరమేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ఆయన వివాద రహితుడిగా ఉండటం, సౌమ్యుడిగా పేరుండటం కొంత సానుకూలత కలిగించే అంశంగా ఉండనుంది.

అంగన్‌వాడీలకు సర్కారు బెదిరింపులు..!

◆ పలు ప్రాంతాల్లో నోటీసులు అందజేత

◆ కేంద్రాలకు వెళ్లి నోటీసులు అతికిస్తున్న ఐసిడిఎస్ సిబ్బంది

◆ బెదిరింపులకు బెదిరేది లేదంటున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అంగన్‌వాడీలపై ప్రభుత్వం బెదిరింపుల పర్వం కొనసాగిస్తోంది. అన్ని విధాలుగా భయపెట్టి వారి సమ్మెను విచ్ఛన్నం చేసే కుట్రకు పూనుకుంటోంది. ఇప్పటికే అంగన్‌వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించింది. దీనికి వారు భయపడకపోవడంతో తాజాగా నోటీసులు అందించే చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. ఇందులో భాగంగా గత రెండు రోజులుగా ఆయా మండలాల్లో అంగన్‌వాడీలకు ఐసిడిఎస్ సిబ్బంది ద్వారా నోటీసులు అందించి బెదిరించాలని చూస్తున్నారు. ప్రభుత్వం ఎన్ని బెదిరింపులకు దిగినా తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మెను విరమించేది లేదంటూ అంగన్‌వాడీలు తెగేసి చెబుతున్నారు.

తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారం నాడు 31వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లోనూ సమ్మె నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. నిరసన శిబిరాల్లో కూర్చొని వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నారు. ఈ సమయంలో ప్రభుత్వం ఐసిడిఎస్ అధికారుల ద్వారా అంగన్‌వాడీలపై బెదిరింపులకు దిగుతోంది. ఇప్పటికే కొన్ని మండలాల్లో అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు ఇచ్చే ప్రయత్నం చేశారు. వీటిని తీసుకునేందుకు అంగన్‌వాడీలు నిరాకరించడంతో అంగన్‌వాడీ కేంద్రాల తలుపులు, గోడలపై నోటీసులను అతికించి వెళ్తున్నారు. మారుమూల గ్రామాలకు అయితే పోస్టల్ ద్వారా నోటీసులను పంపుతున్నారు. ప్రభుత్వం చేస్తున్న ఈ బెదిరింపులపై అంగన్‌వాడీలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యలను పరిష్కరించి సమ్మెను పరిష్కరించాల్సింది పోయి ఇలా బెదిరింపులకు దిగడం ఏమిటంటూ నిలదీస్తున్నారు.

ఆది నుంచి బెదిరింపులే..

అంగన్‌వాడీల సమస్యలపై ప్రభుత్వం ముందు నుంచే బెదిరింపులకు దిగుతోంది. సమ్మె ప్రారంభం కాగానే అధికారుల ద్వారా బెదిరించారు. దీనిని అంగన్‌వాడీలు ప్రతిఘటించారు. తరువాత సచివాలయ సిబ్బంది ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టే ప్రయత్నం చేశారు. దీనిని కూడా అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. చివరకు ఈ నెల 8వ తేదీలోపు విధుల్లో చేరకుంటే ఎస్మాను ప్రయోగిస్తామని ప్రకటించారు. దీనికి కూడా బెదరకుండా అంగన్‌వాడీలు మొక్కవోని సంకల్పంతో సమ్మెను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో గత రెండు రోజులుగా షోకాజ్ నోటీసులు ఇచ్చి ఒత్తిడి తెచ్చేలా కుట్రలు చస్తున్నారు. ప్రభుత్వం ఆదేశించిన మేరకు ఈ నెల 8వ తేదీలోపు విధుల్లోకి ఎందుకు చేరలేదంటూ షోకాజ్ నోటీసుల ద్వారా కోరుతున్నారు. నోటీసుకు సంతృప్తికరమైన సమాధానం ఇవ్వకపోతే శాఖపరమైన చర్యలు తీసుకుంటమాని కూడా బెదిరిస్తున్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న బెదిరింపుల వైఖరిపై అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బెదిరింపులకు తలొగ్గేది లేదంటూ జిల్లా వ్యాప్తంగా సమ్మెను కొనసాగిస్తూ పోరాట పటిమను ప్రదర్శిస్తున్నారు.



గుమ్మఘట్టలో అంగన్‌వాడీ కేంద్రం గోడకు షోకాజ్ నోటీసు అతికిస్తున్న ఐసిడిఎస్ సిబ్బంది

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం : సిపిఎం

అంగన్‌వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ 31 రోజులుగా చేస్తున్న సమ్మెను అణిచివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించడాన్ని నిరసిస్తూ శుక్రవారం నాడు రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. అంగన్‌వాడీలకు న్యాయం చేయాలని కోరుతూ వారికి మద్దతుగా అనంతపురం ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఉదయం 11గంటలకు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు కోసం నిర్వహిస్తున్న అంగన్వాడీల సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ఎస్మా చట్టాన్ని ఉపయోగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రభుత్వం ఇలా బెదిరింపు ధోరణలు అవలంభించడం సిగ్గుచేటుగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్‌వాడీలను చర్చలకు పిలిచి వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని కోరారు. అంగన్‌వాడీల సమ్మెకు సంఘీభావం, ఎస్మా చట్టానికి నిరసనగా శుక్రవారం నాడు జరుగుతున్న రౌండ్‌టేబుల్ సమావేశానికి తెలుగుదేశం, కాంగ్రెస్, సిపిఐ, సిపిఐ ఎంఎల్, న్యూ డెమోక్రసీ, ఎస్‌యుసిఐ, బీఎస్పీ పార్టీలతో పాటు వివిధ ప్రజా సంఘాలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.



అనంతపురం కలెక్టరేట్ ఎదుట కుర్చీలను తిప్పి నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ కమిషనర్, జెడ్పీ సిఇఒ



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న మేఘుస్వరూప్

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురం మున్సి పల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమితులైన మేఘ స్వరూప్, నూతన జెడ్పీ సీఈవో వైకం నడియాదేవిని కలెక్టర్ గౌతమిని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా కలెక్టర్‌ను కలిసి పూల మొక్కలు అందజేశారు. శుక్రవారం వీరిద్దరూ బాధ్యతల్లో చేరనున్నారు.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలి : ఎస్పీ

అనంతపురం క్రైం : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్ని విభాగాలు కలిసి సమర్థవంతంగా పని చేద్దామని ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని పోలీసు, సెబ్, ఎక్సైజ్, ఆర్టీఏ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, అటవీశాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా ప్రణాళికాబద్ధంగా ముందస్తు చర్యలు చేపడదామన్నారు. బెల్టు దుకాణాలు ఉండకూడదన్నారు. అక్రమంగా నగదు, బంగారు ఆభరణాల తరలింపును అడ్డుకోవాలన్నారు. ఎఫ్‌జె వాష్, ఐ.డి లిక్కర్, గంజాయి సీజ్ చేయడం, పీడీ యాక్టుకు అర్హులైన వారిని ఐడెంటిఫై చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, జి.రామకృష్ణ, హనుమంతు, ఎక్సైజ్ సూపరింటెండెంట్, రీజినల్ విజిలెన్స్ ఆఫీసర్ మునిరామయ్య, డీఎస్పీలు ఆంథోనప్ప, బి.శ్రీనివాసులు, సి.ఎం గంగయ్య, యు.నరసింగప్ప, జి.ప్రసాదరెడ్డి, ఏ.ఆర్ డీఎస్పీ మునిరాజా, ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్, పాల్గొన్నారు.

19 నుంచి కులగణన సర్వే : కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్ : జిల్లాలో ఈనెల 19వ తేదీ నుంచి కులగణన సర్వే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు కలెక్టర్ ఎం.గౌతమి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు జిల్లాలో కులగణన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కులగణన సర్వేలో వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని సూచించారు.

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి : జీవానందరెడ్డి



పామిడి : తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు పెరుమాళ్ల జీవానందరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలనలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ముఖ్యంగా కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడం, వేతనాల పెంపు, పీఆర్సీ అమలు వంటికి అమలు చేయకుండా మోసం చేశారన్నారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలండర్ విడుదల చేస్తామని చెప్పి నిరుద్యోగులకు తీరని ద్రోహం చేశారన్నారు. టిడిపి పాలనలో ప్రతి విద్యార్థికీ ఉపకార వేతనాలు వచ్చేవన్నారు. అదే వైసిపి వచ్చాక ఆ ఊసేలేకుండా పోయిందన్నారు. అలాగే రైతులకు గిట్టుబాటు ధర, మద్యపాన నిషేధం ఊసే లేదన్నారు. ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియా, బురీదందాలు మితిమీరిపోయాయన్నారు. ప్రత్యేక హోదా తెస్తానని, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. నిర్మించడం మాని కూల్చడం కాల్చడమే అలవాటు చేసుకున్న జగన్ రాష్ట్రంలో అభివృద్ధిని పూర్తిగా విస్మరించారన్నారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖామని ధీమా వ్యక్తం చేశారు.

వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటా : ఎంపి

కుందుర్పి : అధైర్యపడొద్దు అండగా నేను ఉన్నానని కళ్యాణదుర్గం ఇన్‌ఛార్జి, ఎంపి తలారి రంగయ్య వైసిపి కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఎంపి గురువారం పక్షవాతానికి గురైన కుందుర్పి గ్రామ సచివాలయ కన్వీనర్ మంగళ నాగరాజును, కరెంట్ సత్తి, ఈడిగ చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం 'ఆడుదాం ఆంధ్ర'లో భాగంగా ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన కబడ్డీ పోటీలను తిలకించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ లక్ష్మినరసింహ, పంచాయతీ కార్యదర్శి మహబూబ్ బాషా, హెడ్ కానిస్టేబుల్ గంగన్న, జడ్పిటిసి రాధాస్వామి, సర్పంచులు మారుతీశ్వరి రామ్మూర్తి, గంగాధర, గౌని ప్రభాకర్, మసాల జగన్, ఎంపిటిసి గంగమ్మ, వైస్ ఎంపిపి భీమరెడ్డి, నాయకులు సత్యనారాయణశాస్త్రి, మందలపల్లి భీమప్ప, గోపాల్, నాగలక్ష్మి, రాము, పాల్గొన్నారు.

జెఎన్‌టియులో ముగిసిన న్యాక్ బృందం పర్యటన



మాట్లాడుతున్న విసి రంగజనార్ధన

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియులో న్యాక్ పీర్ కమిటీ సందర్శన గురువారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా విసి రంగజనార్ధన మాట్లాడుతూ అధ్యాపకులు, అందరి సహకారంతో న్యాక్ నుంచి మంచి గ్రేడ్ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి అధ్యాపకుడి సహకారంతోనే మంచి గ్రేడ్ వస్తుందన్నారు. అంతేగాకుండా న్యాక్ పీర్ కమిటీ సభ్యుల సలహాలు, సూచనలు వర్శిటీ సిబ్బందికి ఎంతగానో తోడ్పడుతాయన్నారు. ఇందులో భాగంగా రెండో రోజు టి.త్యాగ రాజన్ బృందం కళాశాలలో మెకానికల్ విభాగం, ఎంబీఏ, ఓటిపిఆర్ఐ, స్పోర్ట్స్ కౌన్సిల్, సివిల్ విభాగం, కెమికల్ విభాగం, డిస్పెన్సరీ విభాగాలను సందర్శించి పలు సూచనలు,సలహాలు ఇచ్చారు. అనంతరం టి.త్యాగ రాజన్‌ను విసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయకుమార్, డైరెక్టర్ జి.వి.సుబ్బారెడ్డి, యూనివర్సిటీ డైరెక్టర్లు, అనంతపురం కళాశాల ప్రిన్సిపాల్ యస్.వి.సత్యనారాయణ, ప్రిన్సిపాళ్లు, వైస్ ప్రిన్సిపాళ్లు, అడహక్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి పర్యటన అలా జరగాలి.. సమస్యలేమో ఇలా ఉన్నాయి... కార్యక్రమం ఎలా నిర్వహించాలి.. అంటూ చిలమత్తూరు మండల వైసిపి నాయకులు తలలు పట్టుకుంటున్నారు. వైసిపి రాయలసీమ జిల్లాల రీజనల్ కోఆర్డీనేటర్, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి శుక్ర, శనివారాలు రెండు రోజుల పాటు చిలమత్తూరు మండలంలో పర్యటించనున్నారు. మంత్రి పర్యటనకు సంబంధించి మండల స్థాయి నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో అభివద్ధి పనులు జరక్కపోవడంతో మంత్రికి సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామస్తుల నుంచి వ్యతిరేకత రాకుండా కార్యక్రమాన్ని ఎలా విజయవంతం చేయాలన్న దానిపై స్థానికులు మల్లగుల్లాలు పడుతున్నారు.



పర్యటన అలా సమస్యలు ఇలా నిర్వహణ ఎలా?

◆ మంత్రి పర్యటనపై వైసిపి నేతల మల్లగుల్లాలు

◆ నేడు, రేపు మండలంలో మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

◆ స్వాగతం పలుకుతున్న సమస్యలు

◆ గ్రామస్తులు ప్రశ్నించకుండా బుజ్జగింపులు

ప్రజాశక్తి-చిలమత్తూరు

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గత నాలుగు రోజులుగా హిందూపురం నియోజకవర్గంలో విస్తృత పర్యటనలు చేస్తున్నారు. ఆయా మండలాల్లో గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడే అధికార పార్టీకి కొత్త తలనొప్పులు వస్తున్నాయి. వివిధ సమస్యలపై ఆయా గ్రామాల్లో మంత్రిని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. బుధవారం నాడు లేపాక్షి మండలంలో రోడ్ల సమస్యపై మంత్రిని అక్కడి ప్రజలు చుట్టుముట్టి నిరసన తెలిపారు. దీంతో ఒక్కసారిగా వైసిపి నాయకులు ఖంగుతున్నారు. ఈ ఘటనను దృష్టిలో ఉంచుకున్న చిలమత్తూరు వైసిపి నాయకులు ముందస్తు చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. మంత్రి పర్యటించే గ్రామాల్లో ఎలాంటి ప్రశ్నలూ వేయొద్దని గ్రామస్తులను కోరుతున్నారు. గురువారం నాడు పలు గ్రామాల్లో వైసిపి గ్రామ, మండల నాయకులు ఈ రకంగా ఆయా గ్రామాల్లో ప్రజలను బుజ్జగించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ప్రశ్నించే వారు... నిలదీసే వారిని సభలకు తీసుకెళ్లకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

అధ్వానంగా గ్రామీణ రోడ్లు

చిలమత్తూరు మండల పరిధిలోని దేమకేతేపల్లి పంచాయతీ తమ్మినాయనపల్లి, కోడూరు పంచాయతీలోని మధురేపల్లి, మొరసలపల్లి పంచాయతీలోని ఎస్.ముదిరెడ్డిపల్లి, చిలమత్తూరు పంచాయతీలోని చిన్నన్నపల్లి, శెట్టిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మూడు గ్రామాలకు రోడ్డు సదుపాయం అధ్వానంగా ఉంది. రోడ్డు సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో దానిని పరిష్కరించకుండా ఏ పార్టీకి ఓట్లు వేయమంటూ స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో తమ్మినాయనపల్లి గ్రామస్తులు నిర్ణయం తీసుకున్నారు. అప్పట్లో అధికార పార్టీ నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల అనంతరం రోడ్డు వేస్తామని వారికి హామీ ఇచ్చి ఓట్లు వేయించుకున్నారు. ఎన్నికల ముగిసిన తరువాత హామీని గాలికి వదిలేశారు. ఈ సమస్యపై ఆ గ్రామస్తులు మంత్రిని ప్రశ్నించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం ఉదయం ఈ పంచాయతీలోనే మంత్రి పర్యటన ఉన్న నేపథ్యంలో అక్కడ ఎలాంటి పరిస్థితి ఎదురవుతుందోనని వైసిపి నాయకుల్లోనే ఆందోళన కన్పిస్తోంది.

పేదలకు అందని ఇళ్ల స్థలాలు..

చిలమత్తూరు మండలంలో ఇళ్ల పట్టాల కోసం పేదలు నెలల తరబడి పోరాటాలు చేస్తున్నారు. ఇక్కడి పట్టాల పంపిణీ సమస్య రాష్ట్ర స్థాయిలో ప్రకంపనలు సృష్టించింది. సిపిఎం ఆధ్వర్యంలో పేదలు కోడూరు సర్వే నెంబర్ 805లో గుడిసెలు వేసుకుని భూస్వాధీన పోరాటం ప్రారంభించారు. ఇక్కడ పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా కొందరు అధికార పార్టీ నాయకులు పోలీసులు, రెవెన్యూ అధికారుల సాయంతో గుడిసెలను రాత్రికేరాత్రికే తొలగించారు. దీనిపై పేదలు ఆగ్రహించి భూ పోరాట ఉద్యమాన్ని తీవ్రతరం చేసి జిల్లా స్థాయిలో కొనసాగించారు. విజయవాడలో సైతం నిరసన తెలిపి అక్కడ ముఖ్య అధికారులకు వినతులు అందజేశారు.

అక్రమ అరెస్టులు..

చిలమత్తూరులో జరుగుతున్న పోరాటాలకు వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ఇతర నాయకులు నాయకత్వం వహించారు. ఈ పరిస్థితుల్లో మంత్రి పర్యటిస్తున్న సందర్భంగా పేదలు ఇళ్ల స్థలాల కోసం ఆయన్ను నిలదీస్తే వైసిపి నేతల రియల్ ఎస్టేట్ బాగోతాలు బయటకు వస్తాయని భావించిన అధికార పార్టీ ముఖ్య ప్రజాప్రతినిధి పథకం ప్రకారం వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్‌ను అక్రమ కేసులో అరెస్టు చేయించి, రిమాండ్‌కు తరలించారనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.





మధురేపల్లి రోడ్డు వేయాలని సిపిఎం ఆధ్వర్యంలో వరినాట్లు వేస్తున్న గ్రామస్తులు (ఫైల్ ఫోటో)

పార్టీలోనూ ఐకమత్యం కరువు..

మండల వైసిపిలోనూ గ్రూపు విభేదాలు తారాస్థాయికి చేరాయి. హిందూపురం నియోజకవర్గంలో మంత్రి పర్యటిస్తుండగానే చిలమత్తూరు జడ్పీటీసీ, ఎంపిపి వర్గాలు ఒకరిపై ఒకరు బాహాబాహికి దిగారు. మూడు రోజుల క్రితం చోటు చేసుకున్న ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ సమయంలో అందరూ కలిసి ఉన్నారనే సంకేతాలు ఆ పార్టీ క్యాడర్‌కు ఇచ్చేందుకు అసమ్మతి వర్గంలోని ఒకరికి మండల కన్వీనర్ పదవిని ఇచ్చారు. దీనిపై మరో వర్గం తీవ్ర స్థాయిలో అసంతప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. కన్వీనర్‌గా మంత్రి ప్రకటించినా అధికారికంగా ఉత్తర్వులు అందని పరిస్థితి ఉంది. మంత్రి పర్యటన ముగిసిన తరువాత కన్వీనర్ పోస్టు వచ్చేదే లేదంటూ ప్రత్యర్థి వర్గీయులు బాహాటంగానే చెబుతున్నారు. ఓ వైపు సమస్యలు.. మరో వైపు పోరాటాలు.. పార్టీలో గ్రూపు రాజకీయాల నేపథ్యంలో మంత్రి సమన్వయం పేరుతో రెండు రోజులు పాటు మంత్రి నిర్వహించే కార్యక్రమాలు ఏ మేరకు జరుగుతాయన్నది వేచి చూడాల్సి ఉంది.

మాట నిలుపుకుంటారా..

కుర్చీ తిప్పేయమంటారా..?

జిల్లావ్యాప్తంగా కొనసాగిన సమ్మె-'అనంత'లో కుర్చీలను తిప్పి అంగన్‌వాడీల నిరసన



ఉరవకొండలో 31 ఆకారంలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అంగన్‌వాడీలకు తెలంగాణ కంటే అదనంగా వేతనాలు పెంపుదల చేస్తామంటూ ఇచ్చిన హామీని అమలు చేసి మాట నిలుపుకుంటారా.. లేకపోతే రాబోయే ఎన్నికల్లో సిఎం కుర్చీ తిప్పేస్తామంటూ.. అంటూ అంగన్‌వాడీలు హెచ్చరించారు. తమ న్యాయమైన సమస్యల సాధన కోరుతూ అంగన్‌వాడీలు సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 31వ రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా వివిధ రూపాల్లో వినూత్నంగా నిరసనలు తెలిపారు. సమస్యలు పరిష్కరించకపోగా ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తూ బెదిరింపులకు దిగడాన్ని నిరసిస్తూ అంగన్వాడీలు కలెక్టరేట్ ఎదుట దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్మికులు, సిఐటియు నాయకులు శిబిరం వద్ద రోడ్డుపై బైఠాయించి కుర్చీలను తిప్పి తలపై పెట్టుకుని నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే రానున్న ఎన్నికల్లో సిఎం కుర్చీని కూడా తిప్పుతామని హెచ్చరించారు. దీక్షలను సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.నాగమణి, ఎస్.నాగేంద్రకుమార్, సిపిఎం నగర న్యూ కమిటీ కార్యదర్శి ఆర్.వి.నాయుడు, సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ, నాయకులు పోతులయ్య, చంద్రశేఖర్, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ముస్కిన్, ఆటో కార్మికుల యూనియన్ జిల్లా నాయకులు ఆజాం బాషా తదితరులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి, నగర అధ్యక్ష కార్యదర్శులు జయభారతి, జమున, నాయకులు రుక్మిణి, కత్యాయని, అరుణమ్మ, సరళ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు విధుల్లో చేరాలని హుకుం జారీ చేస్తూ అధికారులు ఇచ్చిన నోటీసులను ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గుత్తిలో గురువారం దహనం చేసి నిరసన తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె 31వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా సిడిపిఒ డిప్యూటీ అంగన్వాడీలకు అందజేసిన నోటీసులను కార్యాలయం ఎదుట నిప్పు పెట్టి దగ్ధం చేశారు. సమ్మెకు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కసాపురం రమేష్, సిపిఎం నాయకులు సాకే నాగరాజు, రైతు సంఘం నాయకుడు బి.రామకృష్ణ, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి. రమేష్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి రేష్మ, సెక్టార్ నాయకురాళ్లు పార్వతి, శారద, కళ్యాణి, బావమ్మ, శోభ, గంగ, నాగరత్న, తదితరులు పాల్గొన్నారు.

పామిడి మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె గురువారం కూడా కొనసాగింది. వీరికి రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు అనిమిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలు నిరవధిక సమ్మెలో ఉంటే అధికారులు కేంద్రాలకు వెళ్లి నోటీసులు అతికించడం ఎంతవరకూ సమంజసమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు పామిడి, ఎద్దులపల్లి సెక్టార్ లీడర్లు జయంతి, మహాలక్ష్మి, నారాయణమ్మ, భారతి, జ్యోతి, యశోద, అనిత, సేకునీ, సోఫియా, రజియా, రెహనా, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగింది. వీరికి హరిత ఉద్యానగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.మోహన్‌నాయక్ మద్దతు తెలిపారు. ఈకార్యక్రమంలో వరలక్ష్మి, మహాలక్ష్మి, చంద్రకళ, భార్గవి, అశ్విని, రేష్మ, సావిత్రిబాయి, పల్లవి, అనుపల్లవి, అంజలీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె గురువారం కూడా కొనసాగుతుంది. వీరికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపి రైతుసంఘం మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి, వ్య.కా.సం మండల అధ్యక్షుడు టి.పెద్దయ్య, నాయకులు బి.భాస్కర్‌రెడ్డి, కెవిపిఎస్ నాగభూషణ్, సిఐటియు నాయకులు మహమ్మద్‌బాషా, ఓబులేసు, రామచంద్రారెడ్డి, అంగన్వాడీ మండల అధ్యక్షురాలు జయలలిత, రమాదేవి, శశికళ, అనంతలక్ష్మి, అంగన్వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట మండల పరిధిలో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగింది. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ కార్యదర్శి మేరీ, నాయకురాళ్లు రాధిక, చంద్రకళ, మెహ్రూన్, మల్లమ్మ, అంగనవాడీలు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు. కాగా ఎంపిడిఒ నరసింహమూర్తి ఆధ్వర్యంలో మండలంలోని ముగ్గురు అంగన్వాడీలు, ముగ్గురు హెల్పర్లకు నోటీసులు అందజేశారు. ఈమేరకు ఆయా అంగన్వాడీ సెంటర్లకు నోటీసులు అతికించారు.

ఉరవకొండ, విడపనకల్, వజ్రకరూరు మండల కేంద్రాల్లో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె గురువారం కూడా కొనసాగింది. వీరికి సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. ఇందులో భాగంగా ఉరవకొండ మండల పరిషత్ కార్యాలయం ఎదుట గాంధీ విగ్రహం వద్ద 31వ రోజు చేస్తున్న సమ్మెకు గుర్తుగా నెంబర్ ఆకారంలో కూర్చుని మౌనం పాటించి నిరసన తెలిపారు. అలాగే విడపనకల్ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని మానవహారం ఏర్పాటు చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, విరుపాక్షి, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, సుధాకర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఇంద్రావతి, ఓబులేసు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చెన్నరాయుడు, అరుణకాంతమ్మ, దుర్గాదేవి, రంగమ్మ, శ్వేతనాగు, సరోజమ్మ, బ్యులా, ధనలక్ష్మి, జ్యోతి, రామంజినమ్మ, లోకమ్మ, నాగమణి, శివశ్రీ, సువర్ణమ్మ, శశికళ, లక్ష్మీదేవి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో నోటీసులను దహనం చేస్తున్న అంగన్వాడీలు



పామిడిలో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు



గుమ్మఘట్టలో అంగన్వాడీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ



పుట్లూరులో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు, వామపక్షాల నాయకులు

'ఆడుదాం ఆంధ్ర' పోటీల్లో క్రీడాకారుల మధ్య వాగ్వాదం



వాగ్వివాదం చోటుచేసుకోవడంతో గుమికూడిన జనం

రాయదుర్గం : 'ఆడుదాం ఆంధ్ర'లో భాగంగా గురువారం పట్టణంలో నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీల్లో క్రీడాకారుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. రాయదుర్గం టౌన్, జుంజురంపల్లి జట్లు తలపడ్డాయి. ఆట ఆడేటప్పుడు పాయింట్ల నిర్ణయంలో సందర్భంగా రిఫరీ నిర్ణయాన్ని ఓ జట్టు తిరస్కరించగా మరో జట్టు సమర్థించింది. దీంతో ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య కొద్దిసేపు ఘర్షణ తలెత్తింది. అనంతరం ఎంపిడిఒ కొండయ్య ఇతర పిడిలు రిఫరీ నిర్ణయాన్ని ఇరు జట్లు అంగీకరించాల్సిందేనని సర్ది చెప్పారు. అనంతరం పోటీ యథావిధిగా కొనసాగింది.

ఎస్ఎస్ఏ సిబ్బందికి యుటిఎఫ్ ఆర్థికసాయం

రాయదుర్గం: గుమ్మఘట్ట మండలం ఎంఆర్‌సిలో పని చేసే ఎస్ఎస్ఏ సిబ్బందికి గురువారం పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయం వద్ద మండల యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో రూ. 38,700 అంద జేశారు. గుమ్మఘట్ట మండలంలో పని చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సాయం చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో గుమ్మఘట్ట ఎంఇఒలు నాగమణి, వెంకట రమేష్, హెచ్ఎం వెంకటేష్‌బాబు మురహర, జిల్లా ఎన్‌జిఒ ఉపాధ్యక్షులు కెంచే లక్ష్మీనారాయణ, యుటి ఎఫ్ జిల్లా కార్యదర్శులు రవికుమార్, హనుమంతరెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ఎవిఆర్ విద్యాసంస్థలో ముందస్తు అడ్మిషన్లను ఆపాలి



ఎవిఆర్ విద్యాసంస్థ కరపత్రాలను దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ, ఎఐవైఎఫ్ నాయకులు

రాయదుర్గం : పట్టణంలోని ఎవిఆర్ విద్యాసంస్థ చేస్తున్న ముందస్తు అడ్మిషన్లను తక్షణం నిలుపుదల చేయాలని ఎస్ఎఫ్ఐ, ఎఐవైఎఫ్ నాయకులు విద్యాశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఎవిఆర్ విద్యాసంస్థ బస్సులో పర్యటిస్తూ కరపత్రాలు పంపిణీ చేస్తూ అడ్మిషన్లు చేస్తున్న సిబ్బందిని గురువారం ఎస్ఎఫ్ఐ, ఎఐవైఎఫ్ నాయకులు అడ్డుకున్నారు. సిబ్బంది దగ్గర ఉన్న కరపత్రా లను దహనం చేసి బస్సు టైర్ల గాలి తీసివేసినట్లు తెలిపారు. వెంటనే విద్యాశాఖ ఉన్నతాధికారులు ఎవిఆర్ యాజమాన్యంపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు బంగి శివ, గౌతమ్, వెంకీ సూరి, ఈశ్వర్, ఎఐవైఎఫ్ తాలూకా కార్యదర్శి కొట్రేష్, యోగేంద్ర, సునీల్ పాల్గొన్నారు.

'ప్రత్యేక' ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

అనంతపురం : ట్రేడ్ స్పెషల్ స్కూల్ ఆధ్వర్యంలో ప్రత్యేక విద్యలో భాగంగా ప్రత్యేక విద్య చేసిన ఉపాధ్యాయులకు జిల్లా కేంద్రంలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ట్రేడ్ స్పెషల్ స్కూల్ మేనేజ్ ట్రస్టీ డి.గురుమూర్తి తెలిపారు. ఇందులో భాగంగా గురువారం ఆర్డీటీ ఆధ్వర్యంలో నగరంలోని ప్రశాంత్‌నగర్‌లో ఉన్న ట్రేడ్ స్పెషల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణను ఎడి రసూల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ ఐఇఆర్‌పి, ఐఇడిఎస్ఎస్ వారికి ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం 18 పాయింట్లు కలిగిన వారికి సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుధాకర్, రాష్ట్రంలోని ఐఇఆర్‌పిలు, ఐడిఎస్ఎస్‌లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రాయదుర్గం : అసిస్టెంట్ ఇఆర్ఒ వి.దివాకరరెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ పి.సుజాత, ఎఎస్ఐ భాస్కర్ గురువారం స్థానిక బాలగంగాధర్ తిలక్ మున్సిపల్ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, నెహ్రూ ఉర్దూ పాఠశాల, ఇందిరా బస్తీ మున్సిపల్ పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఆయా కేంద్రాల్లో లైట్లు, ఫర్నిచర్, ర్యాంపు, టాయిలెట్లు, తదితర సౌకర్యాలను పరిశీలించారు. ఓటర్లు పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించడానికి, బయటకు వెళ్లేందుకు బారికేడ్లు ఏర్పాటు చేసేందుకు వీలందా లేదా అనే విషయాన్ని కూడా పరిశీలించారు. వారితో పాటు ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్, సూపర్వైజర్లు, తదితరులు ఉన్నారు.

పాల్యంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'



మహిళకు కరపత్రం అందజేస్తున్న పార్లమెంట్ డాక్టర్స్ సెల్ అధ్యక్షురాలు హిమబిందు

పామిడి : మండలంలోని పాల్యం గ్రామంలో గురువారం 'బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అనంతపురం పార్లమెంట్ డాక్టర్స్ సెల్ అధ్యక్షురాలు హిమబిందు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం వైఫల్యాలను వివరించడంతోపాటు టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కిషోర్, గోవిందనాయక్, పార్థసారథి, రాజేష్, కృష్ణ, మధు, ప్రతాప్, తిరుపాలు, రామాంజి, శీన, నల్లప్ప, మునీంద్ర, చాగంటి గోవిందరాజులు, రామయ్య, నారాయణ, కదిరప్ప, మనోహర్, ఉమానాయక్, రాధా, జానకి, మాధవి, టిడిపి, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యార్థిని ఆత్మహత్య



మృతిచెందిన శ్రీలయ

పామిడి : పట్టణంలో 1వ వార్డులో నివాసం ఉంటున్న పాండురంగారావు కుమార్తె శ్రీలయ (21) గురువారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పాండురంగారావు పట్టణంలోని 1వ వార్డులో టైలరింగ్ పని చేసుకుంటూ నివాసం ఉంటున్నాడు. ఈయన పెద్ద కుమార్తె శ్రీలయ ఎస్‌కె యూనివర్శిటీలో ఎంఎస్‌సి ఫిజిక్స్ రెండవ సంవత్సరం చదువుతూ హాస్టల్‌లో ఉంటోంది. ఈనేపథ్యంలో శ్రీలయ తరచూ కడుపు నొప్పితో బాధపడుతూ ఉండేది. ఈ విషయంపై తల్లిదండ్రులకు చెప్పగా చాలాసార్లు ఆసుపత్రుల్లో చూపించి కళాశాలకు పంపేవారు. ఈ సమయంలో సంక్రాంతి సెలవులు రావడంతో రెండు రోజుల క్రితం ఇంటికి వచ్చింది. దీంతో గురువారం కూడా కడుపునొప్పి రావడంతో తట్టుకోలేక ఇంట్లోని బెడ్రూంలోకి వెళ్లి ఇంటి పైకప్పునకు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు తండ్రి పాండురంగారావు ఫిర్యాదు మేరకు పామిడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం బోల్తా.. వ్యక్తికి గాయాలు

పుట్లూరు : ద్విచక్ర వాహనం బోల్తా పడి వ్యక్తికి గాయాలైన ఘటన గురువారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల సమాచారం మేరకు బాలాపురం గ్రామానికి చెందిన చెరుకూరి ప్రసాద్ తాడిపత్రి నుంచి స్వగ్రామం బాలపురానికి ద్విచక్ర వాహనంలో వస్తుండగా పుట్లూరు సమీపంలోని సబ్‌స్టేషన్ వద్దకు రాగానే అదుపుతప్పి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ



కరపత్రాలు అందజేస్తున్న టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రైతులను ఆదుకోవడం తో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫల మైందని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ విమర్శించా రు. గురువారం మండలంలోని నీలా రెడ్డిపల్లి గ్రామంలో పర్యటించి రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ జిల్లాలో కరువు విలయతాండవం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నా రు. రైతుల పట్ల సిఎం జగన్‌కు కనీస కనికరం లేకుండా పోయిందన్నారు. వైసిపి ప్రభుత్వానికి రైతులను ఆదుకోవడంలో చిత్తశుద్ధి లేదన్నారు. అంతేగాకుండా అధిక ధరలు పెంచుతూ, వైసిపి ప్రభుత్వం బాదుడే బాదుడుగా పన్నులు వేస్తోందన్నారు. భవిష్యత్తుకు చంద్రబాబు పాలన గ్యారెంటీ అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే మహాశక్తి పథకం కింద మహిళలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. అంతేగాకుండా బస్సులో ఉచిత ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికీ రూ.15వేలు, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500 అందించనున్నట్లు తెలిపారు. అలాగే రైతులకు అన్నదాత పథకం కింద రూ.20వేలు ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పసుపుల హనుమంతురెడ్డి, జొన్నా రామయ్య, ఓబుళపతి, ఆదినారాయణ, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులుగా సుధాకర్

ఉరవకొండ : కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులుగా తాటిచెర్ల సుధాకర్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు నియోజకవర్గ బాధ్యులు రవికృప రామానాయుడు, జిల్లా కార్యదర్శి ఇంద్రావతి ఓబులేసు తెలిపారు. ఈమేరకు గురువారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నియామకపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి, డీసీసీ నాయకులు సోనియా సీనా, అబ్బాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం ప్రజాశక్తి పత్రిక చేస్తున్న కృషి ఎనలేనిదని తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంపిడిఒ అమృతరాజ్ కొనియాడారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో ప్రజాశక్తి నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రజలకు మధ్య వారధిగా ప్రజాశక్తి పత్రిక పని చేస్తోందన్నారు. ముఖ్యంగా కార్మికులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ బేసిక్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ఎప్పటికప్పుడు కథనాలు రాస్తూ చైతన్యం తీసుకొచ్చిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సంజీవ్‌కుమార్, ఎపిటిఎఫ్ అసోసియేట్ కార్యదర్శి హనుమప్ప, జిల్లా ఉపాధ్యక్షులు సాకే భాస్కర్, జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు, నిస్వార్థ సేవా సంస్థ వ్యవస్థాపకులు తాటికొండ వెంకట్ గురూజీ, సప్తగిరి మల్లి, ఫౌండేషన్ వ్యవస్థాపకులు మల్లికార్జున, ఎరుకుల సేవాసంఘం రాష్ట్ర కార్యదర్శి కోలేగుండ్ల శేఖర్, లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బోయ సురేంద్ర, అర్థ గణాంక శాఖ జిల్లా కార్యదర్శి పర్వతప్ప, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కిష్టప్ప, కార్యదర్శి వెంకటస్వామి, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

వైసిపిలో బీసీలకు విలువలేదు

పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు



ప్రజాశక్తి-అనంతపురం

వైసిపిలో బీసీలకు తగిన విలువ లేదని పద్మశాలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు విమర్శించారు. గురువారం స్థానిక జిల్లా టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేనేత కులానికి సంబంధించిన కర్నూలు ఎంపి డాక్టర్ సంజీవ్‌కుమార్ వైసిపికి, ఎంపీ పదవికి రాజీనామా చేయడం చూస్తుంటే వైసిపిలో బిసిలకు ఎంత ప్రాధాన్యత ఉందో అర్థం అవుతుందన్నారు. ముఖ్యంగా చేనేత రంగానికి చేయూతనందివ్వకుండా, సంక్షేమానికి నిధులు కేటాయించకుండా కేవలం తన పత్రికల్లో ఆర్భాటం తప్ప చేసింది శూన్యమన్నారు. చేనేత ఉత్పత్తులపై జీఎస్టీని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. బీసీలకు పదవులు తప్ప, పవర్ ఇవ్వడం లేదన్నారు. కేవలం సిఎం తన సామాజిక వర్గానికి మాత్రమే పవర్ ఉందని ఆరోపించారు. ఈ విషయాలను బిసి సోదరులు గమనించాలని సూచించారు.

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం




అన్నదానం చేస్తున్న నిత్యసురభి ట్రస్టు సభ్యులు

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో గురువారం నగరంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలామురళి మాట్లాడుతూ కీర్తిశేషులు బొమ్మకంటి వెంకట సుబ్రమణ్యశాస్త్రి రచించిన సద్గురు సాయి లీలామృతం నిత్య పారాయణ గ్రంథం 32సార్లు పూర్తయిన సందర్భంగా అన్నదానం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సౌదామణి, సుబ్రమణ్యం, సుబ్బారావు, ఓబులపతి, కిష్టప్ప, నబిరసూల్ పాల్గొన్నారు.

పార్టీ నిర్ణయానికి కట్టుబడి పని చేస్తాం

ఎపిఐఐసి ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి



మాట్లాడుతున్న మెట్టు

ప్రజాశక్తి-రాయదుర్గం

పార్టీ నిర్ణయానికి కట్టుబడి పని చేస్తామని ఎపిఐఐసి ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో ఎవరూ వైసిపిని వీడి ఇతర పార్టీలోకి వెళ్లలేదన్నారు. పట్టణంలోని తన నివాసంలో గురువారం మెట్టు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బాధ్యతలు చూసుకో మని అధిష్టానం ఆదేశించినందున నాయకులు, కార్యకర్తలు అందరినీ సమన్వయం చేసుకుంటూ రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే చాలామంది ప్రజాప్రతిని ధులు, నాయకులు, కార్యకర్తలు తనను కలిశారని, మిగిలిన వారు కూడా త్వరలోనే కలిసి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. వైసిపి సామాజిక న్యాయాన్ని పాటిస్తుందని, అభ్యర్థుల ఎంపిక, మార్పులు సర్వసాధారణం అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం అన్నారు. రాజకీయాల్లో ఉండి సంపాదించాలన్న ఆశ తనకు లేదన్నారు. పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఎపిఐఐసి ఛైర్మన్ బాధ్యతలు అప్పగించిందన్నారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ శిల్ప, ఉపాధ్యక్షులు వలిబాషా, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు రాళ్ల తిమ్మారెడ్డి, పట్టణ కన్వీనర్ శివప్ప, చిక్కన్న, ఉషారాణి, మేకల శ్రీనివాసులు, జడ్పిటిసి పద్మావతి, సర్పంచులు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

110 జీవో అమలు చేయాలి

మంత్రి పెద్దిరెడ్డికి ఉద్యోగుల వినతి

అనంతపురం కలెక్టరేట్ : 110 జీఓను అమలు చేసి శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పని చేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్లకు వేతనాలు పెంచాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఉద్యోగ సంఘాల నేతలు విన్నవించారు. గురువారం హిందూపురం నియోజకవర్గంలో పర్యటిస్తున్న మంత్రిని నాయకులు కలిసి తమకు న్యాయం చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా 110 జిఓ అమలు చేసి కనీస వేతనాలతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయచంద్రారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వీరరాజు, కమలాకర్, కరుణాకర్, జమ్మన్న, ఆదిశేఖర్‌రెడ్డి, సాకే రాజు, గణేష్, గురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



మంత్రితో మాట్లాడుతున్న ఉద్యోగ సంఘం నాయకులు



అనంతపురంలో పోస్టర్లను విడుదల చేస్తున్న వైసిపి నాయకులు

అంబేద్కర్ విగ్రహావిష్కరణ పోస్టర్లు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం



అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న మేయర్ వసీ, తదితరులు

విజయవాడలో కృష్ణానది ఒడ్డున ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ పోస్టర్లను గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు అనంతవెంకటరామిరెడ్డి, శంకర్నారాయణ, జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య మాట్లాడుతూ సమసమాజ స్థాపనకు ఎనలేని కృషి చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మేయరు వసీం, డిప్యూటీ మేయర్ కొగటం విజయభాస్కరరెడ్డి, వైసిపి నగర అధ్యక్షులు చింతా సోమశేఖరరెడ్డి, ఆర్టీసీ ఛైర్‌పర్సన్ మంజుల, ఓబులేశు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కార్పొరేషన్ : రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం విజయవాడలో ఏర్పాటు చేస్తుండటం చారిత్రాత్మకమని మేయర్ మహమ్మద్ వసీం కొనియాడారు. విజయవాడలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్మృతి వనం, 125 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణ సందర్భంగా నిర్వహించనున్న సామాజిక సమతా సంకల్పం సభకు సంఘీభావంగా గురువారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, నాయకులు కార్యదర్శి సంగం శ్రీనివాస్, ఇఇలు సూర్యనారాయణ, సుధారాణి, డిఇలు సుబాష్, రవీంద్రారెడ్డి, ద్రాక్షాయణి, ఎ.ఇ ఉమామహేశ్వరి, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

రాయదుర్గం : విజయవాడలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకూ 'సామాజిక సమతా సంకల్పం' కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా గురువారం 1, 11వ సచివాలయాల్లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప అంబే ద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి బాటలో నడవడానికి మద్దతు ఇచ్చేందుకు ఫ్లెక్సీ బ్యానర్‌పై పౌరులు, స్థానిక ప్రజాప్రతినిధులు సంతకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు శారద, మంజునాథ్, కో ఆప్షన్ మెంబర్ శ్రీనివాసులు, వైసిపి నాయకులు పొరాలు శివ, దివాకర్, రామాంజనేయులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



రాయదుర్గంలో సంతకాలు సేకరిస్తున్న అధికారులు

హమాలీలకు పొదుపు నగదు పంపిణీ

రాయదుర్గం రూరల్ : సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణంలోని లక్ష్మీబజార్‌కు చెందిన లక్ష్మీనారాయణ హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో 68 మంది హమాలీలకు గురువారం పొదుపు నగదును గౌరవాధ్యక్షులు బండి క్రిష్టప్ప అందజేశారు. ఏడాదిగా 68 మంది హమాలీ కార్మికులు పనిచేసి పొదుపు చేసిన రూ. 6,32,400 నగదు, మిఠాయి పొట్లాలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ మేనేజర్‌కు సన్మానం

గుత్తి : స్థానిక రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారంలో అదనంగా మరో లిఫ్టు ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన రైల్వేస్టేషన్ మేనేజర్ ఎ.సురేష్‌బాబును వైసీపీ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే స్టేషన్ మేనేజర్ సురేష్ బాబు చొరవ తీసుకుని రైల్వే ఉన్నతాధికారులతో చర్చించి ప్లాట్‌ఫారంలో లిఫ్టును ఏర్పాటు చేయించారు. దీంతో శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ కన్వీనర్ డి.హుస్సేన్ పీరా, నాయకులు భీమలింగ, ఎస్ఎం.బాషా, కెఎం.రంగనాయకులు, సొలమాన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్నకు నివాళి

ప్రజాశక్తి-గుత్తి

స్వాతంత్ర్య సమరయోధులు వడ్డే ఓబన్న జయంతిని పురస్కరించుకుని ఒసిసిఐ (ఓడ్ కమ్యూనిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షురాలు డి.లక్ష్మీదేవి ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న వడ్డే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, ఒసిసిఐ కార్యవర్గ సభ్యులు డి.వరదరాజులు, ధర్మాపురం సర్పంచి ఎం.చంద్ర, మాజీ వార్డు సభ్యులు వెంకటరాముడు, వైసీపీ నాయకుడు డి.షఫీ, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు సి.విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో ఓబన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఐసిసిఐ సభ్యులు

ఉరవకొండ : స్వాతంత్ర్య సమరయోధులు వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా గురువారం వడ్డెర సంఘం ఆధ్వర్యంలో గురువారం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా పట్టణంలోని స్థానిక రోడ్లు, భవనాల అతిథి గృహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ ర్యాలీగా వెళ్లి కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు బుదగ్గవి భీమేష్, గంగాధర్, వీరన్న, హంపయ్య మోహన్, గంగరాజు, అమరేష్, తదితరులు పాల్గొన్నారు.



పామిడిలో ఓబన్నకు నివాళులర్పిస్తున్న వడ్డెర్లు

ఆత్మకూరు : స్వాతంత్ర్య సమరయోధులు వడ్డే ఓబన్న జయంతిని పురస్కరించుకుని గురువారం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసులు, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడిపూటి నారాయణస్వామి, నియోజకవర్గ బీసీ సెల్ నాయకులు రాజా రమేష్, మండల తెలుగు యువత అధ్యక్షులు అంకే ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : స్వాతంత్ర్య సమరయోధులు వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా గురువారం పట్టణంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వడ్డే శివ, వడ్డే మనోజ్‌కుమార్, కొండాపురం రవి, రమణ, డేరంగుల భాస్కర్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు నిత్యావసరాలు పంపిణీ

ఆత్మకూరు : మండలం పరిధిలోని పంపనూరు గ్రామంలో వికలాంగురాలు లక్ష్మీదేవి కుటుంబానికి ప్రగతి వికలాంగుల మండల సమైక్య ఆధ్వర్యంలో గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమైక్య సభ్యులు గంగన్న, రాజశేఖర్, వన్నూరువలి, శ్రీనివాసులు, రామాంజనేయులు, పద్మావతి, మణెమ్మ, హెచ్.రామాంజనేయులు, మర్రెడ్డి నారాయణరెడ్డి, హంపయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఆత్మకూరు : వాహనదారులు నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ కె.జనార్ధన్ హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని హైవేపై వాహనదాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డు నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా నిబంధనలను అతిక్రమించి వాహనాలను అతివేగంగా నడిపినా, లైసెన్స్ లేకుండా ఆటోలు, ట్రాక్టర్లు నడిపినా, ఓవర్ లోడ్‌తో వెళ్లినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ఇబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ఉరవకొండ : పట్టణంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో మౌలిక వస్తువులు కల్పించేందుకు కృషి చేయనున్నట్లు ఎంపిడిఒ అమృతరాజ్, ఉరవకొండ డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి భత్తుల కోదండరామిరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని గురుకుల పాఠశాలను సందర్శించి డ్రెయినేజీతోపాటు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో విద్య, విద్యార్థుల ఆరోగ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రిన్సిపాల్ సునీతకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యుత్ శాఖ ఎఇ గురుమూర్తి, పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ రాజేష్, సభ్యులు గుర్రం రామాంజనేయులు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు రూ.6వేలు పింఛన్ ఇవ్వాలి

శింగనమల : 40 నుంచి 70 శాతం ఉన్న దివ్యాంగులకు రూ.6వేలు, 80 నుంచి వందశాతం ఉన్న దివ్యాంగులకు రూ.8వేలు ఇవ్వాలని హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బి.మోహన్‌నాయక్ డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని నాగులగుడ్డం తండా ఉన్న పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలోకి వచ్చాక వికలాంగులను పూర్తిగా విస్మరించారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పించన్ పెంచడంతోపాటు స్థలం, ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి గుంతకల్లు నుంచి సైకిల్ యాత్ర ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ యాత్రలో దివ్యాంగులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో దివ్యాంగులు రమేష్, రాజు, మణి, రామాంజనేయ, రమేష్, భాస్కర్‌రెడ్డి, అంజి, శ్రీను, రాజు, రాజశేఖర్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులకు గౌరవం ఇవ్వాలి

అనంతపురం : దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధులకు ప్రభుత్వాలు తగిన గౌరవం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డిసంఘం రాష్ట్ర అధ్యక్షులు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహ ఆవిష్కరణలో నరేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బావితరాలకు స్వాతంత్ర్య సామరయోధుల గురించి తెలియజేసే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డిసంఘం గౌరవాధ్యక్షులు గట్టిరెడ్డి బయపరెడ్డి, పాటిల్ రామకృష్ణారెడ్డి ,కేశవరెడి, హనుమంతురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లాల్ బహుదూర్ శాస్త్రికి నివాళి

గుత్తి : మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి వర్ధంతిని గురువారం ఎపి రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని పెన్షనర్ల భవనంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షులు కె.అబుబకర్, ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ, కార్యదర్శి కె.రామ్మోహన్, అదనపు కార్యదర్శి జన్నే కుల్లాయిబాబు, సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, కోశాధికారి పక్రుద్దీన్, నాయకులు శామ్యూల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించడమే ధ్యేయం : ఎంపిపి

ఉరవకొండ : క్రీడలను ప్రోత్సహించడమే ప్రభుత్వ ధ్యేయమని విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని పాల్తూరు, పెద్దకొట్టాలపల్లి క్రీడా మైదానాల్లో ఏర్పాటు చేసిన ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలను ప్రారంభించారు. ముందుగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారులను ఎంపిపి పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు, వైసిపి సీనియర్ నాయకులు కరణం భీమిరెడ్డి, ఎంపిటిసి తిమ్మరాజు, డిష్ వెంకటేష్, రాజశేఖర్, శ్రీనివాసులు, సునీల్‌రెడ్డి, శంకరగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కులగణనపై అవగాహన

రాయదుర్గం : పట్టణంలో కులగణనపై సచివాలయ సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు, రిజర్వ్ సిబ్బందిని సచివాలయ సిబ్బందితో నియమించే విషయమై సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కులగణన సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలను కమిషనర్ సచివాలయ సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డు సచివాలయాలకు సంబంధించిన సచివాలయ అడ్మిన్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.